# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 07-03-2025                    సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ కేంద్రపాలిత ప్రాంతమైన దాద్రా నాగర్ హవేలి, డయ్యూ డామన్‌లను దేశ వారసత్వ సంపదగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు.

- ❖ యూరప్‌తో భారతదేశానికి పేరుగుతున్న ఏకీభావాన్ని భారత్ గుర్తించిందని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ పేర్కొన్నారు.

- ❖ కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (CISF) దేశాభివృద్ధిలో భాగమై, కీలక భద్రతా సేవలందిస్తున్నదని కేంద్రమంత్రి అమిత్ షా ప్రశంసించారు.

- ❖ దేశంలో 15 వేలకు పైగా జన్ ఔషధి కేంద్రాలు ప్రతిరోజూ 10 లక్షల మందికి సేవలు అందిస్తున్నాయని కేంద్రమంత్రి జే పి. నడ్డా అన్నారు.

======================

కేంద్రపాలిత ప్రాంతమైన దాద్రా నాగర్ హవేలి, డయ్యూ డామన్‌లను దేశ వారసత్వ సంపదగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. ఈ రోజు సిల్వాసాలో 2 వేల 587 కోట్ల రూపాయల విలువైన 62 ప్రాజెక్టులకు ఆయన ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేశారు. 460 కోట్ల రూపాయలకు పైగా ఖర్చుతో నిర్మించిన 450 పడకల "నమో ఆసుపత్రి" మొదటి దశను కుడా ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ప్రధానమంత్రి మాట్లాడుతూ... ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సంరక్షణ, విద్య, పర్యాటక రంగం పరంగా అభివృద్ధిలో ఈ ప్రాంతం ఒక ప్రత్యేక గుర్తింపును సాధించిందని అన్నారు. రైలు, రోడ్డు వ్యవస్థల అభివృద్ధి పర్యాటక రంగానికి పెద్ద ప్రోత్సాహాన్నిచ్చిందని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన భారతదేశాన్ని సృష్టించడం ద్వారా అభివృద్ధి చెందిన భారతదేశం అనే దార్శనికతను సాధించవచ్చని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 37 సెకన్లు)

======================

కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (CISF) దేశాభివృద్ధిలో భాగమై, దేశ ప్రజలను కాపాడుతూ.. పలు కీలకమైన ప్రదేశాలలో సేవలందిస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశంసించారు. ఈ రోజు తమిళనాడు తక్కోలంలో జరిగిన CISF 56వ వ్యవస్థాపక దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. దళాల కవాతును సమీక్షించి 127 మంది CISF అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ... 2019 నుండి దేశంలోని ఇతర ప్రాంతాలలో CISF వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రైళ్లు, మెట్రోలు, విమానాశ్రయాలు, ఓడరేవుల ద్వారా ప్రయాణించే కోటి మంది ప్రయాణికులను కూడా CISF రక్షిస్తోందని మంత్రి అన్నారు. దేశాన్ని రక్షించడంలో CISF చేస్తున్న కృషి గురించి గ్రామాల్లో నివసించే ప్రజల్లో అవగాహన పెంచేందుకు కోస్టల్ సైక్లోథాన్ ర్యాలీ నిర్వహిస్తున్నామని కేంద్రమంత్రి అమిత్ షా వెల్లడిస్తూ...

(వాయిస్ 36 సెకన్లు)

=======================

ప్రజలకు అత్యున్నత నాణ్యతతో తక్కువ ధరలతో మందులను అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన, దృఢమైన భారతదేశాన్ని నిర్మించే ప్రభుత్వ నిబద్ధతను జన్ ఔషధి దివస్ ప్రతిభింభిస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. జన్ ఔషధి దినోత్సవం సందర్భంగా ఈ రోజు ప్రధానమంత్రి సామాజిక మధ్యమ వేదికగా సందేశం అందించారు. దేశంలోని ప్రతిచోటకు నాణ్యమైన మందులు చేరుతున్న విధానం, ప్రజలకు అందుతున్న పొదుపు గూర్చి భారతదేశ జన్ ఔషధి విధానం ప్రపంచాన్ని ప్రేరేపిస్తున్న పరిస్థితులను ప్రధానమంత్రి ప్రస్తావించారు. గుండె చికిత్స గతంలో కంటే ఇప్పుడు సరసమైనదిగా మారిందని, మోకాలి ఇంప్లాంట్ల ఖర్చు కూడా తగ్గిందని పేర్కొన్నారు.

విరామం

=======================

యూరప్‌తో భారతదేశానికి పెరుగుతున్న ఏకీభావాన్ని భారత్ గుర్తించిందని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ పేర్కొన్నారు. ఐర్లాండ్ పర్యటనలో ఈ రోజు డబ్లిన్‌లో విశ్వవిద్యాలయ కళాశాలలో కేంద్రమంత్రి ప్రసంగించారు. 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ 2030 నాటికి 3వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందన్నారు. భారత్, యూరప్ యూనియన్ మధ్య దాదాపు 23 సంవత్సరాలుగా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుపుతున్నాయన్నారు. అలాగే ఇరు దేశాల మధ్య బలమైన వాణిజ్య బంధం ఉందని తెలిపారు. రెండు దేశాల ప్రముఖ కంపెనీలు ఇరు ఆర్థిక వ్యవస్థలలో ఘనంగా తమ ఉనికిని చాటుకుంటున్నాయని జైశంకర్ తెలియజేస్తూ...

(వాయిస్ 40 సెకన్లు)

=======================

కరోనా మహమ్మారి సమయంలో వ్యూహాత్మక నాయకత్వం, విలువైన సహాయానికి గుర్తింపుగా తనకు గౌరవ ఆర్డర్ ఆఫ్ ఫ్రీడమ్ ఆఫ్ బార్బడోస్ అవార్డును ప్రదానం చేసినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు బార్బడోస్ ప్రభుత్వానికి, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. బార్బడోస్‌లోని బ్రిడ్జ్‌టౌన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధానమంత్రి మోడీ తరపున విదేశాంగ శాఖ సహాయ మంత్రి పబిత్రా మార్గెరిటా ఈ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డుపై సామాజిక మాధ్యమ వేదికగా ప్రధానమంత్రి స్పందిస్తూ... ఈ అవార్డును 140 కోట్ల మంది భారతీయులకు, భారత్, బార్బడోస్ మధ్య సన్నిహిత సంబంధాలకు అంకితం చేస్తున్నానని పేర్కొన్నారు.

=======================

భారతదేశంలో 15 వేలకు పైగా జన్ ఔషధి కేంద్రాలు ప్రతిరోజూ 10 లక్షల మందికి సేవలు అందిస్తున్నాయని కేంద్ర ఆరోగ్య మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా అన్నారు. ఈ రోజు జన్ ఔషధి దివస్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....

"అచి భి, సస్తి భి" అనే శక్తి వంతమైన మంత్రంతో ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి పరియోజన (PMBJP) అందరికీ ఆరోగ్య సంరక్షణను అందించడంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తోందని ప్రశంసించారు. 50 నుండి 90 శాతం వరకు తగ్గించిన ధరలకు అధిక నాణ్యత గల మందులను జన్ ఔషధి కేంద్రాలు అందిస్తున్నాయని వివరించారు. ఈ కేంద్రాలు ప్రతి భారతీయుడికి అవసరమైన ఆరోగ్య సంరక్షణ అందుబాటులో ఉండేలా చేస్తున్నాని తెలియజేస్తూ...

(వాయిస్ 40 సెకన్లు)

========================

కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత పరిశ్రమలకు తగ్గట్టుగా తదుపరి తరాన్ని సిద్ధం చేయడంలో పరిశ్రమ, విద్యా వ్యవస్థల సహకారం ప్రముఖ పాత్ర పోషిస్తాయని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన ఒక సమావేశంలో మంత్రి ప్రసంగించారు. దేశంలోని 240 విశ్వవిద్యాలయాలు ప్రముఖ ప్రపంచ సంస్థలకు చెందిన కృత్రిమ మేధ సెమీకండక్టర్ డిజైన్ సాధనాలను కలిగి ఉన్నాయన్నారు. కృత్రిమ మేధ పరిశ్రమ అవసరమైన పరిజ్ఞానంతో విద్యార్థులు పట్టభద్రులయ్యేలా చూసేందుకు విద్య సంస్థలు ఇటువంటి చొరవ తీసుకోవాలని విద్యావేత్తలకు అశ్విని వైష్ణవ్ పిలుపునిచ్చారు.

========================

భరత్ – అమెరికాలు బహుళ రంగాల ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలను ముందుకు తీసుకెళ్లే ప్రక్రియలో ఉన్నాయని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. ఈ రోజు పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ... గత నెలలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమెరికా పర్యటన సందర్భంగా పరస్పరం ప్రయోజనకరమైన, బహుళ రంగాల ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరపాలని రెండు వర్గాలు ప్రకటించాయని పేర్కొన్నారు.

========================
========================